# సింగిల్ పేజీ కథలు

## జ్ఞాని

అది ప్రభుత్వం వారు కట్టించిన పబ్లిక్ పార్కు...చాలా ఏళ్లక్రితం నాటిది కావడం వల్ల పాతబడిన సిమెంటు బెంచీలతో, అరిగి పెచ్చులు ఊడిపోయిన జారుడు బల్లలతో కళావిహీనంగా వుంది.

ఆ పార్కులో..అక్కడక్కడ సిమెంటు బెంచీల మీద వయసు మళ్లి, మళ్లిన వయసులో వచ్చే సమస్యలకు పరిష్కారం తేలక, మనశ్శాంతిని వెతుక్కుంటూ వచ్చే వయోవృద్ధులు..వయసు పండిన స్నేహబంధాలతో ఒకరిని ఒకరు పలకరించుకుంటూ ఆప్యాయతలు, అభిమానాలు పొంగివస్తుంటే, కాసేపు దక్కే మనశ్శాంతితో తృప్తిపడుతూ, గత అనుభవాల పరంపరలతో పావుగంట, అరగంట కంటే ఎక్కువ కూర్చోలేని బలహీనులు..కూర్చుని ఉన్నారు.

అదిగో..అప్పుడే వచ్చాడు అక్కడికో పెద్దమనిషి. చూడ్డానికి చాలా సంస్కారవంతుడిలా ఉన్నాడు. అతనిలో కాస్తంత హుందాతనం...ఎదుటివాళ్లను అయస్కాంతంలాంటి తన చూపులతో ఆకట్టుకునే ముఖవర్ఛస్సు..అతను రావడంతోనే అందరికీ దూరంగా ఒక చోట బాసిమఠం వేసుకుని కూర్చున్నాడు. అప్రయత్నంగా అందరి చూపులు అతనివైపు మళ్లాయి. అతను ఏదో ధ్యానంలో కూర్చున్నవాడిలా కన్నులు మూసుకుని, నుదిటిమీద చూపుడువేలుతో రుద్దుతూ, చాలాసేపు కదలకుండా కూర్చుని వుండిపోయాడు.

అతడు తిరిగి కనులు తెరిచి చూసేసరికి పార్కుకు వచ్చిన వయోవృద్ధుల్లో కొంతమంది భక్తి, వినయాలతో అతని ముందు కూర్చుని ఉండడం గమనించాడు..అతని ముఖం వికసించింది. అంతవరకు కళ్లు మూసుకుని కూర్చుని ఉన్న అతను, ఎవరికీ తెలియని మహత్తర విషయమేదో తను కనిపెట్టినట్లు అందరివైపు ఒకసారి పరిశీలనగా చూసి, తను వచ్చిన పని ప్రారంభించాడు.

"మీది ఏ మతం?" ఒకతన్ని చూసి అడిగాడు.

"హిందూమతం"

"మీది?" మరొకర్ని

"క్రైస్తవమతం"

"మరి మీది?" ఇంకొకర్ని

"ఇస్లాం మతం"

"మీరు చెప్తారా?" గుంపులో ఇంకొకర్ని

"బౌద్ధమతం"

"మీమీ మతాలనుబట్టి మీమీ దేవుళ్లు, వాళ్ల ఆకారాలు, అవతారాలు, ఆచారాలు, పూజావిధానాలు, కర్మకాండలు ఉంటాయి కదా?"

"అవునండి" అన్నారు అందరూ.

"నాకో సందేహం?"

"చెప్పండి"

"మీమీ మతాల్లానే, మీమీ ప్రాణాలు కూడా హిందూమతం వాళ్ల ప్రాణమని, ముస్లిం మతం వాళ్ల ప్రాణమని, క్రైస్తవమతం వాళ్ల ప్రాణమని, ఇంకా ఇతర మతాల వాళ్ల ప్రాణాలని విడివిడిగా వుంటాయా?"

"మీ సందేహం చాలా హాస్యాస్పదంగా ఉంది" అందరిలో ఒకడు.

"ఎందుకని?"

"మతాలు, దేవుళ్లు వేరయినంత మాత్రాన, ప్రాణాలు ఎలా వేరుగా వుంటాయండి. అందరిలో ఉన్నది ఒకే ప్రాణం కదా?"

"అని ఎలా అనుకోవాలి?"

"అనుకోవడం ఏమిటండీ, అందరిలో ఉన్నది ఒకే ప్రాణమని జగమెరిగిన సత్యమేకదా?"

"మరయితే, అందరిలో ఉన్నదీ ఒకే ప్రాణమని ఒప్పుకుంటున్నారు కదా, ఆ ప్రాణశక్తికి పునాది, ప్రాణదాత, అయిన భగవంతుడు కూడా ఒక్కడేనని ఒప్పుకుంటారా?"

"అబ్బ..నెత్తిబొప్పికట్టేలా ఎంత పెద్ద దెబ్బ కొట్టారండి. మీ ప్రశ్నతో"

"నేను వేసిన ప్రశ్నకు మీకు బొప్పికట్టిందీ అంటే..సమాధానం 'అవును' అని ఒప్పుకుంటే సరిపోతుందేమో?"

"ఇటువంటి క్లిష్టమయిన ప్రశ్నలు ఎదురయినప్పుడు 'గోడమీది పిల్లి' వాటంలా ఉండిపోవటం నా నైజం"

"అవునవును. మీ వంటి గోడమీది పిల్లి వాటంగాళ్లు ఉండబట్టే ఈ ప్రశ్నకు సమాధానం ఉన్నా, లేనట్లే మరుగునపడిపోతోంది. సమాజం మతాల మత్తులో కొట్టుకుపోతోంది."

అంతా నిశ్శబ్దం.

"నిజాన్ని ఒప్పుకోవడానికి ఆత్మబలం కావాలి. ఆత్మబలం కావాలంటే ఆత్మ విమర్శ కావాలి. ఆత్మవిమర్శ కావాలంటే ఆలోచన కావాలి. ఆలోచించే వాడు అహంకారాన్ని వదలగలగాలి. అహంకారాన్ని వదిలితే...ఇంకేముంది? అంతా అర్థమయినట్లే"

తనకు తెలిసిన జ్ఞాన సంపదను తన చుట్టూ కూర్చున్నవారికి ఇంకా పంచిపెడుతూ ఉండగానే పిచ్చాసుపత్రి వేను వేగంగా వచ్చి అతన్ని ఎక్కించుకుని వెళ్లిపోయింది.

-బి.ధనలక్ష్మి (హైదరాబాద్)

ooo




ఖరీదైన ఆ భవంతిలో ఆధునికంగా అలంకరించబడిన ఆ గదిలో కూర్చుని ఎన్నో కథలూ, నవలలూ సృష్టించి గొప్ప రచయిత్రిగా పేరు సంపాదించుకుంది రమాదేవి.

రమాదేవి భర్త రమణారావు ఓ సాఫ్ట్‌వేర్ కన్సల్టెంటు కంపెనీలో ఐదంకెల జీతగాడు. నెలకు పదిరోజులు టూర్ల మీదుంటాడు.

రమాదేవికి ఒక పది నెలల పసిపాప. దాని ఆలనా పాలనా చూసేందుకు ఆయా వుంది. ఆమె పేరు సీత.

సీత ఓ అనాథ. పెళ్ళయిందికాని మొగుడు ఏ కారణం చేతో వదిలేసాడు. ఇద్దరు పసిబిడ్డలు. తండ్రి వున్నా గానీ రోగిష్టి. సంసార భారం సీతమీదే పడటంచేత ఆ లేత వయసులోనే రమాదేవి బిడ్డకు ఆయాగా కుదిరింది.

సీత అణకువగల పిల్ల. పనిమంతురాలు. అన్ని సుగుణాలున్నవాళ్ళకే దేవుడు అదనంగా కష్టాలు రాసిపెడతాడు కాబోలు అనిపిస్తుంది రమాదేవికి. సీత జీవితం మీద ఓ కథ కూడా రాసి పోటీలో బహుమతి సంపాదించింది ఆమె.

'అలాంటి సీత..ఇలాంటి పని చేస్తుందా?' ఆరోజు మధ్యాహ్నం తన గది కిటికీగుండా చూసిన దృశ్యాల్ని నమ్మలేకుండా వుంది